క్లుప్తంగా

ఏపీపీఎస్‌ఎఫ్ మండల నూతన కార్యవర్గం



జి.మాడుగులలో సమావేశమైన పంచాయతీ కార్యదర్శులు

జి.మాడుగుల: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ జి.మాడుగుల మండల కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. మండల ఏపీపీఎస్‌ఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా ఆర్.రవిశాస్త్రి, గౌరవ అధ్యక్షుడుగా డి విజయరాజు, ఉపాధ్యక్షుడిగా జె.అచ్చంనాయుడు, కార్యదర్శి చిన్నం నాయుడు, జాయింట్ కార్యదర్శిగా కె.వెంకట్, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



తహసీల్దార్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్‌లు కోరారు. నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దారు జి.ఆనందరావును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలు, భూ సమస్యలు, రేషన్‌కార్డులు జారీ వంటి సమస్యలను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా త్రినాథరావు నాయుడు



పెదబయలు: మండల తహసీల్దార్‌గా వంజంగి త్రినాథరావు నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు మండల తహసీల్దార్‌గా పనిచేసి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు.

తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు ఘన సన్మానం



తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న గిరిజన ఐక్యవేదిక నాయకులు

జి.మాడుగుల: మండల తహసీల్దార్ జి.రాజ్ కుమార్‌కు శనివారం గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సుర్ల లోవరాజు తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించి, గిరిజన ప్రాంతాల్లో మరిన్ని అత్యున్నత పదవులు చేపట్టి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. నాయకులు మత్స్యరాజు, వెంకటరమణ, పోతురాజు, సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం హుళక్కేనా?

- సర్కారు పాఠశాలల్లో నేటికీ చేరని ఏకరూప దుస్తులు
- విద్యాలయాలు తెరుచుకుని రెండు నెలలు గడుస్తున్నా స్పందన శూన్యం
- అధికారుల నిర్లక్ష్యమంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అడ్డతీగల: విద్యాలయాలు తెరుచుకుని రెండవ నెల గడుస్తున్నా అడ్డతీగల మండలంలోని విద్యార్థులకు మాత్రం ప్రభుత్వం నుంచి రావాల్సిన యూనిఫాం క్లాత్ విడుదల కాలేదు. రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాలకుగాను ఆరు మండలాలకు ఇప్పటికే విద్యార్థులకు అందించాల్సిన యూనిఫాం సరఫరా చేసేశారు. కానీ అడ్డతీగలంలో అలా జరగలేదు. మండలంలో వివిధ యాజమాన్యాల కింద 92 పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10 తరగతుల వరకూ 5,375 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.వీరంతా గత ఏడాది ఇచ్చిన యూనిఫాం పాడైపోయి ప్రస్తుతం యూనిఫాం లేకుండానే పాఠశాలలకు వస్తున్నారు. ఇలాగైతే ఎప్పుడు యూనిఫాం వస్తుంద.. ఎప్పుడు విద్యార్థులకు అందిస్తారో ఆ దేవుడికే ఎరుక అన్నట్టు పరిస్థితి నెలకొంంది. ఏటా విద్యాసంవత్సరం ఆరంభం నాటికే యూనిఫాం అందుబాటులోనికి రావడం వాటిని పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులకు అందించేవారు.కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణంగా చెప్తున్నారు. విద్యాశాఖ యంత్రాంగంతో సంబంధిత విభాగం అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించి యూనిఫాం తెప్పించుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖలోని వర్గాలు చెబుతున్నాయి.కానీ ఇక్కడి అధికారులు ఆపని చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



యూనిఫాం సరఫరా చేయకపోవడంతో సివిల్ దుస్తులతో మండల కేంద్రంలోని పాఠశాలకు హాజరైన విద్యార్థులు

అధికారులు స్పందించాలి

పాఠశాలలు తెరిచి నెల గడిచినా నేటి వరకు మా పిల్లలకు యూనిఫాం అందలేదు. గతంలో పాఠశాలలు తెరిచిన నాటికీ ముందుగానే రెండు జతల యూనిఫాం, బ్యాగు, పుస్తకాలు ఇతరత్రా సామగ్రి అందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– అప్పారావు, అడ్డతీగల

అధికారులను సంప్రదించాం



యూనిఫాం కోసం అధికారులను సంప్రదించాం. త్వరలో పంపిస్తాం అంటున్నారు.మిగతా మండలాలకు యూనిఫాం సరఫరా కావడం వాస్తవమే.అందుబాటులోనికి యూనిఫాం రాగానే పాఠశాలల వారీగా సరఫరా చేస్తాం.

పి.శ్రీనివాసరావు, ఎంఈవో, అడ్డతీగల



యూనిఫాం లేకుండా ఎంపీపీ పాఠశాలకు హాజరైన విద్యార్థులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

- సాక్షి కథనానికి స్పందించిన ఐసీడీఎస్ పీడీ ఝాన్సీభాయి
- సెంటర్ల భవనాల పరిస్థితి, స్టాకుపై ఆరా



కిలగాడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాలు దిద్దిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఝాన్సీభాయి



అంగన్‌వాడీ కేంద్రంలో సరకులను పరిశీలిస్తున్న పీడీ ఝాన్సీభాయి

సాక్షి ఎఫెక్ట్..

ముంచంగిపుట్టు: బాల్యంలోనే పిల్లల మేధాశక్తికి పునాది వేసేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ సీహెచ్.ఝాన్సీ భాయి అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన 'కేంద్రాలు ఇలా..నిర్వహణ ఎలా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ పీడీ ఝాన్సీ భాయి స్పందించారు. ఈ మేరకు మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలోని ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు–1,2లను తనిఖీలు చేశారు. భవనాల పరిస్థితులను పరిశీలించి, అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడి భవనాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారానికి సంబంధించిన సరకులను, సరఫరా అవుతున్న గుడ్ల సైజ్‌లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని, తల్లిబిడ్డ క్షేమంగా ఉంటారని ఆమె సూచించారు. కేంద్రాల్లో ఉన్న ఐదేళ్ల లోపు చిన్నారులకు నిర్వహిస్తున్న ప్రీస్కూల్ బోధనను పరిశీలించారు. పిల్లల సామర్థ్యంపై పలు ప్రశ్నలు వేశారు. కొంతమంది చిన్నారులకు పీడీ ఝాన్సీభాయి పలక పట్టి అక్షరాలు దిద్దించారు. ప్రీస్కూల్ బోధనను అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా నిర్వహించి, పిల్లలకు ప్రాథమిక విద్యను అందించాలని ఆమె సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



కారం సింగరాజును పరామర్శిస్తున్న నాయకులు

వి.ఆర్.పురం: ఇటీవల తులసిపాక ఘాట్ రోడ్డులో జరిగిన బైక్ ప్రమాదంలో కాలు విరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుమారుడు కారం సింగరాజును తన నివాసమైన కోప్పల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త కారం సీతారామయ్య కుమారుడు మారేడుమిల్లి వెళ్తుండగా తులసిపాక ఘాట్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కింద పడడంతో కుడికాలు విరిగింది. వారం రోజుల చికిత్స అనంతరం భద్రాచలం ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, ఆర్టీఐ జిల్లా విభాగ అధ్యక్షుడు బొడ్డు సత్యానారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజు, ఎస్సీ సెల్ మండల నాయకులు వెంగళరావు, రంగారావు, పెంటయ్య,రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన నెట్‌వర్క్‌తో టీచర్లకు వెతలు

- ఆన్‌లైన్ హాజరు నమోదు కాక ఉపాధ్యాయులకు ఇక్కట్లు
- నిలిచిన సెల్ సిగ్నల్ వ్యవస్థ



ఆన్‌లైన్ హాజరు నమోదు కోసం రాజవొమ్మంగి పాఠశాల ప్రాంగణంలో సెల్‌ఫోన్లతో టీచర్లు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగని క్లస్టర్ సమావేశానికి వందలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ప్రిన్స్‌పాళ్లు ఫేషియల్ హాజరు నమోదు కాక ఇబ్బంది పడ్డారు. సమావేశం ముగిసిన తరువాత కూడా సాయంకాలం చాలాసేపు పాఠశాల ప్రాంగణంలోనే సెల్‌ఫోన్లు చేత పట్టుకొని సిగ్నల్స్ కోసం వేచి ఉండాల్సి వచ్చిన పరిస్థితి నెలకొందని పలువురు చెప్పారు. మండలంలో సెల్‌టవర్స్ పనిచేయడం లేదని, నెట్‌వర్క్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన



అరకులోయలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి



జి.మాడుగులలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

అరకులోయటౌన్: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలకు శనివారం అరకులోయ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.హిమగిరి గంజాయి, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా గ్రామానికి వెళ్లినప్పుడు తమ తల్లిదండ్రులు, స్థానికులకు గంజాయి వల్ల నష్టాలు, సైబర్ క్రైమ్ మోసాల గురించి వివరించాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి వలన జీవితాలు నాశనమవుతాయన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో సైబర్ క్రైమ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోపాలరావు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు విద్యాభివృద్ధి సాధించాలని ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ బంధవీధి గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ పోక్సో, మహిళా చట్టాలను అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, కెరీర్ గైడెన్స్‌పై ఆయన అవగాహన కల్పించారు.

దోమల నివారణకు విస్తృతంగా స్ప్రేయింగ్



గంగవరంలో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ అక్కమ్మ

గంగవరం : గ్రామాల్లో నిర్వహిస్తున్న మలేరియా స్ప్రేయింగ్‌ను నూరుశాతం వినియోగించుకోవాలని, దోమల వ్యాప్తి కారణంగా మలేరియా , టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన అన్నారు. మండల కేంద్రమైన గంగవరంలో నిర్వహిస్తున్న మలేరియా స్ప్రేయింగ్‌ను ఆమె పర్యవేక్షించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సూరిబాబు మాట్లాడుతూ గంగవరం పీహెచ్‌సీ పరిధిలోని 26 గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ నూరుశాతం పూర్తి చేశామన్నారు. రెండో విడతలో గంగవరం, లక్కొండ, చీడిపాలెం గ్రామాలు పూర్తిచేసినట్టు ఆయన తెలిపారు. గంగవరం పాతబ్యాంక్ వీధిలో నిర్వహిస్తున్న స్ప్రేయింగ్‌ను సర్పంచ్ కలుముల అక్కమ్మ పరిశీలించారు.

బదిలీ ఉద్యోగులకు ఆత్మీయ సన్మానం



జీకే వీధిలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగులతో సర్పంచ్ రామకృష్ణ



చౌడుపల్లిలో బదిలీపై వెళ్తున్న సర్పంచ్ లలిత, ఎంపీటీసీ మీనాకుమారి

జీకె వీధి: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవతోనే మంచి గుర్తింపు పొందుతారని దామనాపల్లి సర్పంచ్ కుందెరి రామకృష్ణ అన్నారు. మండలంలోని దామనాపల్లి సచివాలయంలో బదిలీ అయిన ఉద్యోగులను సర్పంచ్ రామకృష్ణ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలను కొనియాడారు. మీ సేవలతోనే మా ప్రాంతం ఎంతో అభివృద్ధికి నోచుకుందన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకట శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఉద్యోగులు తమ విధుల్లో అందించిన సేవలతోనే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మిలి లలిత అన్నారు. మండలంలోని చౌడుపల్లి సచివాలయాల పరిధిలో బదిలీ అయిన ఉద్యోగులను సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సచివాలయ ఉద్యోగులు ఈ ప్రాంత గిరిజనానికి అందించిన సేవలను కొనియాడారు. ఎరపీటీసీ లువ్వాబు మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శులు వెంకటరావు, విజయశాంతి, వీఆర్‌వో పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం, కోరాబు కరుణానిధి, గ్రామపెద్దలు వెంగాళయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: పి.యర్రగొండ గ్రామాన్ని ఎంపీడీవో కె.బాపన్నదొర శనివారం పర్యటించి, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి సూచనలిచ్చారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆందోళన



ట్రాన్స్‌ఫార్మర్ ముందు నినాదాలు చేస్తున్న గిరిజనులు

అరకులోయటౌన్: మండలంలోని పెదలబుడు పంచాయతీ శరభగుడ కాలనీలో రోజు అప్రకటిత విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానికులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ శరభగుడ కాలనీకి త్రీ ఫేజ్‌లైన్ మంజూరై ఏడాది కావస్తున్నా నేటి వరకు ఏర్పాటుచేయలేదన్నారు. దీంతో తరచూ లో ఓల్టేజీ సమస్యతో స్థానికులు సతమతమవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామస్తులు రమణ, అప్పన్న. .బుజ్జి, భాగ్య, తార, ఆషిష్, సాయి, దేబో, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పే



అరకు డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్‌నాయక్ తదితరులు



ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు




జి.మాడుగులలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో డేవిడ్‌రాజ్, తహసీల్దార్ రాజ్‌కుమార్



డుంబ్రిగుడలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



చింతపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి



అడ్డతీగలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులతో ఉపాధ్యాయులు



రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అరకులోయటౌన్: అల్లూరి జిల్లాలో శనివారం స్వచ్ఛంధ్ర – స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై ర్యాలీలు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు, గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీరని ముప్పు కలుగుతుందన్నారు. పర్యావరణానికి నష్టం కలిగించే పాలిథిన్, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని సూచించారు. భూకాలుష్యం, జల కాలుష్యం, వాయు కాలుష్యం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని, ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలని, ప్లాస్టిక్ పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, నీరు, గాలి విషతుల్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ వస్తువులు అనారోగ్యానికి హేతువుగా మారతాయన్నారు.పాలిథిన్ కవర్లు వినియోగించొద్దని సూచించారు. ప్లాస్టిక్ బదులు నార, కాగితపు సంచులను వినియోగించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పోడి చెత్తాలను వేరు చేసి వాటిని సంపద కేంద్రాలకు తరిలించేందుకు సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు సంభందించి ప్రతిజ్ఞ చేశారు. అరకులోయలోని డిగ్రీ, మహిళా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చలపతిరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్స్‌పిల్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, పి.నాగబాబు, స్వర్ణాంధ్ర–స్వచ్ఛంధ్రా కో ఆర్డినేటర్ బాలరాజు, అధ్యాపకులు గణేష్, అప్పారావు, లచ్చన్న, సొంబాబు, రాజు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎంఈవో శెట్టి సుందరరావు, వెలుగు ఏపీఎం సుందరమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది సారీ, పంచాయతీ కార్యదర్శి గౌతమీ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని వారపు సంతలో తహసీల్దార్ కె.శంకరరావు పర్యటించి, పాలిథిన్ కవర్ల వినియోగంపై వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, ఏపీవో వెంకటేశ్వరరావు, ఏవో మురళీకృష్ణ, పంచాయితీ కార్యదర్శి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో డేవిడ్‌రాజ్, తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ , ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, ఎంఈవో సీహెచ్. బాబూరావుపడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, డీటీ ఈశ్వరరావు, ఏపీఎం ఈశ్వర్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి రవిశాస్త్రి, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీవో రాజు, సీడీపీవో శ్రీదేవి, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రమణి, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపూడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న ఏపీవో శ్రీనివాస్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన వాడిగా వేడిగా సాగింది. అధికార ప్రతిపక్షం అనే తారతమ్యం లేకుండా సభ్యులు స్థానిక ఉపాధి హామీ కార్యాలయం పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు ఐదు వారాలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారు ఎలా బతకాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, ఉపాధి ఏపీఓ శ్రీనివాస్‌ను నిలదీశారు. సిబ్బంది సక్రమంగా ఆన్‌లైన్‌లో మస్టర్లు వేస్తే ఈ ఇబ్బంది ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా, కనీసం సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండానే ఇంకుడు గుంతలు, పశువుల తొట్టెలు మంజూరు చేసి ఇష్టం వచ్చిన చోట వాటిని ఏర్పాటు చేశారని సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. కింద్ర పంచాయతీ, ముంజవరప్పాడులో జరిగిన పనుల్లో అవినీతిపై సంబంధిత అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, పలుచోట్ల జరిగిన పనులకు బిల్లులు ఎందుకు మంజూరు చేయలేదని సభ్యులు ప్రశ్నించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఇస్తామని, తన చేతుల్లో లేదని ఏపీవో శ్రీనివాస్ సమాధానం చెప్పడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆన్‌లైన్ హాజరుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, శిథిలావస్థలోని పాఠశాలలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని, పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవోను సభ్యులు కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని లబ్బర్తి ఎంపీటీసీ సభ్యుడు గొల్లపూడి పెద్దిరాజు కోరారు. పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని సర్పంచ్ రమణి అధికారులను కోరారు. మండలంలో అర్ధంతరంగా నిలిచిన రహదారుల పనులపై గిరిజన సంక్షేమ డీఈ గౌతమిని ప్రశ్నించారు. పలుచోట్ల అటవీశాఖ అనుమతులు లేక పనులు నిలిచినట్టు ఆమె సమాధానం చెప్పారు. ఏటీడబ్ల్యూవో, మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు సభకు గైర్హాజరు కావడం పట్ల సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ సత్యనారాయణ. వైస్ ఎంపీపీలు చంద్రరాణి, రాజేశ్వరి, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.